232) దేసాళం

ప॥ పంట వండుకొనేవారిబాగ్యము లిటమీద- । నంటిముట్టి వెదకితే నాతుమ లోననున్నది ॥

చ॥ వేదములలో మొలచె వేదాంతాల గొనసాగె । గాదిలి శ్రీహరిభక్తికల్పలత ।
పోదియెక్కె వైరాగ్యబోధలచే బలుమారు । పాదుకొని వేరువారె పంచసంస్కారాలను ॥

చ॥ అల్లుకొనె మునులతో నంటెను బురాణాల । చెల్లుబడి శాస్త్రాల జిగిరించెను ।
చల్లగా బూవులు వూచె సత్కర్మవిదులను । మెల్లనే నీడలు నిండె మించి సుజ్ఞానమున ॥

చ॥ పరమయోగముల బూపలు బిందెలు వుట్టె । పరగె సురలనేపందిటియందు ।
యిరవై శ్రీవేంకటేశు డిందుకు ఫలమైనాడు । గురుసెవలను దొరకును వివేకులకు ॥